ప్రజాశక్తి

సోమవారం 20 జనవరి 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

నేటి నుంచి భూముల రీసర్వే

- మండలానికో గ్రామం ఎంపిక
- తాడేపల్లి, మంగళగిరికి మినహాయింపు
- వట్టిచెరుకూరు, పెదనందిపాడు మండలాల్లో గతంలోనే సర్వేపూర్తి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా భూముల రీ సర్వే సోమవారం నుంచి ప్రారంభం కానుంది. పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలో మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపిక చేశారు. మంగళగిరి, తాడేపల్లి మండలాలు కార్పొరేషన్‌లో కలవడం వల్ల సర్వేనుంచి ఈ మండలాలను మినహాయించారు. గత ప్రభుత్వ హయాంలోనే వట్టిచెరుకూరు, పెదనందిపాడు మండలాల్లోని అన్ని గ్రామాల్లో సర్వే పూర్తయింది. దీంతో ఈ మండలాలను కూడా ఎంపిక చేయలేదు. 14 మండలాల్లో 14 గ్రామాలను ఎంపిక చేశారు. రోజుకు 20 ఎకరాలే రెవెన్యూ సిబ్బంది రీ సర్వే నిర్వహిస్తారు. మండలంలో ఒకగ్రామాన్ని సర్వేకు ఎంపిక చేశామని సర్వే శాఖ అసిస్టెంట్ డైరక్టరు ఎ.పవన్ కుమార్ తెలిపారు.

ఎంపిక చేసిన గ్రామాల వివరాలు ఇలా ఉన్నాయి. లచ్చన్నగుడిపూడి (తాడికొండ మండలం), మందపాడు (మేడికొండూరు), వడ్డమాను (తుళ్లూరు), జడవల్లి (పొన్నూరు), పెరికలపూడి (దుగ్గిరాల), మంచాల (చేబ్రోలు), కాంద్రుపాడు (కాకుమాను), మెరికపూడి (ఫిరంగిపురం), మల్లాయపాలెం (ప్రత్తిపాడు), అనమర్లపూడి (పెదకాకాని), చినపలకలూరు (గుంటూరు పశ్చిమ), పెదరావూరు (తెనాలి), జొన్నలగడ్డ (గుంటూరు తూర్పు), కుంచవరం (కొల్లిపర) ఉన్నాయి. ఒక్కొ గ్రామంలో 200 నుంచి 250 ఎకరాలను తొలుత సర్వే చేయాలని నిర్ణయించామని పవన కుమార్ తెలిపారు. రోజుకు కేవలం 20 ఎకరాలను మాత్రమే సర్వే చేయాలని ప్రభుత్వం సూచించింది.

సర్వేలో తొలి విడతగా ప్రభుత్వ భూములు, చెరువు, పోరంబోకు భూములు, అసైన్డు వివరాలను కూడా నమోదు చేస్తారు. ప్రధానంగా గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ, చెరువు, కుంటలు, పోరంబోకు భూములు వివరాలను ఇప్పటికే ఎంపిక చేశారు. అంతేగాక ఇప్పటికే 14 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఏ భూములు ఎవరి అధీనంలో ఉన్నాయి? ప్రభుత్వం ఎవరికి పంపిణీ చేసింది? ఎవరు అనుభవిస్తున్నారనే వివరాలను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. రెవెన్యూ అధికారులు తొలుత ఈ సమాచారం నమోదు చేసిన తరువాత సర్వేకు సంబంధించి రైతులకు సమాచారం ఇస్తారు. జిల్లాలో మొత్తం 173 గ్రామాలు ఉండగా గత ప్రభుత్వ హయంలో 62 గ్రామాల్లో సర్వే పూర్తయింది. 64 గ్రామాల్లో అనేక సమస్యలొచ్చాయి.

గతంలో గ్రామసభలు నిర్వహించి సర్వే వివరాలను రైతులకు వివరించి వారితో లిఖితపూర్వకంగా వివరాలు తీసుకుని నమోదు చేశారు. 2లో

నరసరావుపేటలో మాట్లాడుతున్న సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

అంబేద్కర్‌ను అవమానిస్తే రాచమర్యాదలా?

- సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్
- అమిత్‌షా పర్యటనపై గుంటూరు, పల్నాడు జిల్లాల్లో వామపక్షాల నిరసనలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా, మంగళగిరి

భారత రాజ్యాంగం ఏర్పడి 75 ఏళ్లయిన సందర్భంగా రాజ్యసభలో జరిగిన చర్చలో రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను కించపర్చేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాష్ట్రంలో అడుగు పెట్టే అర్హతలేదని, అనుచిత వ్యాఖ్యల పట్ల ఆయన క్షమాపణలు చెప్పాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. అమిత్‌షా పర్యటనను నిరసిస్తూ గుంటూరు, పల్నాడు జిల్లాల్లో వామపక్షాలు ఆదివారం ప్రదర్శనలు చేశాయి. ఇందులో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట సిపిఎం నిరసనలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా పదవులు పొందిన అమిత్‌షా అదే రాజ్యాంగ నిర్మాత అయిన అంబేద్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయగా అతనికి 2లో

మంగళగిరి అంబేద్కర్ సెంటర్లో నిరసన తెలియజే స్తున్న వామపక్షాలు

ఎలక్ట్రిక్ ట్రాక్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చంనాయుడు

దేశంలోనే తొలి ఈ-ట్రాక్టర్

మురుగని గ్రూపు సంస్థ వాహనాన్ని ఆవిష్కరించిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చంనాయుడు

ప్రజాశక్తి - పెదకాకాని

దేశంలోనే మొదటిసారిగా ఎలక్ట్రికల్ ట్రాక్టర్‌ను మురుగని గ్రూపు సంస్థ ప్రవేశపెట్టగా షోరూంను స్థానిక ఆటో నగర్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చంనాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డీజిల్, పెట్రోల్ వాహనాల వినియోగం క్రమంగా తగ్గిస్తూ ఎలక్ట్రికల్ బస్సులు, కార్లు, టూవీలర్స్ ప్రజలు వాడుతున్నారని చెపాపరు. ఆసియా ఖండంలోనే తొలిసారిగా ఎలక్ట్రికల్ ట్రాక్టర్‌ను రైతులకు అందుబాటులోనికి తేవడం శుభ పరిణామమన్నారు. తక్కువ నిర్వహణ ఖర్చుతో 2లో

వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు.. ముసుగుల్లో నిందితులు

గుంటూరులో కొకైన్ కలకలం

ముగ్గురు అరెస్టు - 8.5 గ్రాముల సరుకు స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులోని శ్యామలా నగర్ వద్ద కొకైన్‌తో ముగ్గురు యువకులు పట్టుబడ్డారని ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. వారి నుండి ఏడు ప్యాకెట్లలోని 8.5 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. గుంటూరు నగరంలో ఒక్క గ్రామ్ కొకైన్ రూ.6 వేల నుంచి రూ.3 వేల వరకు అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. గుంటూరులోని నల్లచెరువు ప్రాంతానికి చెందిన షేక్ దాదావలి, షేక్ ఖాసీం పీరా, షేక్ సమీర్ బాజీ ఇటువంటి మాదక ద్రవ్యాలను అమ్ముతున్నారని, వారిని అరెస్టు చేశామని తెలిపారు. వీరు గుర్తు తెలియని వ్యక్తుల వద్ద కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. గంజాయి మాదక ద్రవ్యాలకు సంబంధించిన వివరాలు 14500 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎం.రవికుమార్‌రెడ్డి, జిల్లా అధికారి వి.అరుణకుమారి పాల్గొన్నారు.

ఎల్ఐసి బలోపేతానికి చర్యలు తీసుకోవాలి

ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి-గుంటూరు

దేశ ప్రయోజనాలను కాపాడుతున్న ఎల్ఐసిని మరింత బలోపేతం చేసే చర్యలు చేపట్టాలని ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి వి.వి.కె.సురేష్ కోరారు. ఆదివారం స్థానిక అరండల్‌పేటలోని ఎల్ఐసి ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ 1956 జనవరి 19వ తేదీన నాటి నెహ్రూ ప్రభుత్వం 245 ప్రైవేటు బీమా కంపెనీలను విలీనం చేసి ప్రభుత్వరంగ ఎల్ఐసిని ఏర్పాటు చేసిందని, అప్పటి నుండి ప్రజల సొమ్ము ప్రజలకే అన్న లక్ష్యంతో 2లో

మాట్లాడుతున్న సురేష్

నేటి నుంచి భూముల రీసర్వే

(మొదటి పేజీ తరువాయి)

అప్పట్లో అనేక వివాదాలు రావడంతో ప్రస్తుతం సర్వేలో వివాదాల పరిష్కారం దిశగా నిర్వహించాలని నిర్ణయించారు. ఒకేసారి గ్రామం మొత్తం సర్వే చేయకుండా దశల వారీగా రోజుకు గరిష్టంగా 20 ఎకరాలను మాత్రమే ఎంపిక చేశారు. దాదాపు 160 రోజుల పాటు సర్వే చేసేందుకు ప్రభుత్వం అధికారులకు గడువు ఇచ్చింది. సర్వే ప్రారంభానికి ముందే స్థానిక రైతులకు పూర్తి సమాచారం ఇవ్వడం, దండోరా, టాంటాం ద్వారా ముందస్తుగా తెలియజేయడం, వారి వద్ద ఉన్న రికార్డుల ఆధారంగా ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న వివరాలను సరిచూసుకుని హక్కుపత్రాలను నిర్ధారిస్తారు. వివాదాలు వస్తే మొబైల్ మేజిస్ట్రేట్‌తో పాటు వివిధ హోదాల్లో ఉన్న ఉన్నతాధికారులకు కూడా భూ యజమానులు ఫిర్యాదు చేయవచ్చు.

సర్వేకు సంబంధించి ఒక్కో బృందంలో ఇద్దరు విలేజ్ సర్వేయర్లు, విలేజ్ రెవెన్యూ అధికారి (విఆర్ఓ), గ్రామ రెవెన్యూ సహాయకుడు (విఆర్ఎ) ఉంటారు. ఇదేవిధానంతో నాలుగు బృందాలను నియమిస్తారు. ఒక బృందం భూ యజమానులకు, ప్రభుత్వానికి మధ్య సమాచారం అందిస్తారు. సర్వే బృందాలు ఆయా భూ యజమానులకు ముందుగా నోటీసు ఇవ్వడం, భూ యజమానితో పాటు ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇవ్వడం, గ్రామంలో ఉన్న రైతులందరికి కలిపి వాట్సాప్ గ్రూపు రూపొందించడం, తహశీల్దార్, సర్వేయర్లు గ్రామాన్ని సందర్శించి గ్రామాన్ని 200 నుంచి 250 ఎకరాలను బ్లాక్‌లుగా విభజించి ప్రతి గ్రామానికి నాలుగు బృందాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

అంబేద్కర్‌ను అవమానిస్తే రాచమర్యాదలా?

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని పాలక పక్షాలు రాచమర్యాదలు చేయడం సిగ్గుచేటన్నారు. అంబేద్కర్‌ను అవమానించడం అంటే దేశద్రోహమేనని, బిజెపి వారి అసలు స్వరూపం ఇదేనని విమర్శించారు. రాజ్యాంగాన్నే మార్చేయాలనే ఆలోచనలో బిజెపి ఉందన్నారు. మంత్రి అమిత్ షా ను పార్లమెంటుకు అనర్హుడిగా ప్రకటించి పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, నాయకులు ఎస్.ఆంజనేయరాజు, సిలార్ మసూద్, డి.సుభాష్ చంద్రబోస్, జి.బాలకృష్ణ, కె.నాగేశ్వరరావు, పిడిఎం నాయకులు ఎన్.రామారావు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా నాయకులు కె.ఏడుకొండలు పాల్గొన్నారు.

మంగళగిరి అంబేద్కర్ సెంటర్‌లో సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) పార్టీల ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లతో నిరసన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వానికి అంబేద్కర్ పట్ల, భారత రాజ్యాంగం పట్ల గౌరవం లేదన్నారు. అమిత్ షా వ్యాఖ్యలను ప్రధాని నరేంద్ర మోడీ ఖండించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, మంగళగిరి పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్, జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, పట్టణ నాయకులు ఎం.బాలాజీ, వై.కమలాకర్, కె.శ్రీనివాసరావు, ఎం.చలపతిరావు, ఎస్.గణేష్, ఎం.నాగేశ్వరావు, ఎం.చంద్రారావు, టి.శ్రీనివాసరావు, వి.శ్రీను, సిపిఐ నాయకులు చిన్ని తిరుపతయ్య, పి.నాగేశ్వరరావు, చిన్ని సత్యనారాయణ, కె.ఈశ్వరరావు, కె.నరసింహారావు, వై.వెంకటేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) నాయకులు కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

లలితా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

లలితా హాస్పిటల్ వైద్యులు సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.విజయ, సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, సీనియర్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ విజయబాబు ఆధ్వర్యంలో ఆదివారం పెదకూరపాడు మండలం, లింగంగుంట్లలో ఉచిత కంటి, బ్రెయిన్ వైద్యశిబిరం నిర్వహించారు. ఈ క్యాంప్‌లో దాదాపు 200 మంది పాల్గొని సద్వినియోగం చేసుకున్నారని వైద్యులు తెలిపారు. బిపి చెకప్, షుగర్‌టెస్ట్, న్యూరాలజి కన్సల్టేషన్, ఆప్తమాలజీ కన్సల్టేషన్, ఇసిజి, కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు అందించారు. అనంతరం డాక్టర్ విజయ పక్షవాతంపై అవగాహన కల్పించారు. పక్షవాతం లక్షణాలు, రిస్క్ ఫ్యాక్టర్స్, పక్షవాతం రాకుండా నివారణ చర్యల గురించి వివరించారు. అలాగే బిపి, షుగర్ ఉన్న వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రత గురించి తెలియజేశారు. ఈ క్యాంప్‌లో డాక్టర్ మాలతి, డాక్టర్ సతీష్, డాక్టర్ యశ్వంత్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ విజయ

అపురూప పుస్తకం.. జగజ్జాన నవల

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచంలో వెయ్యినొక్క నవలలు రాసిన ఏకైక తెలుగు రచయిత కొవ్వలి లక్ష్మీనరసింహారావు అని సాహితీవేత్త డాక్టర్ సిహెచ్.సుశీల తెలిపారు. అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అధ్యక్షతన ఆదివారం అవగాహన కార్యాలయంలో జరిగిన సభలో కొవ్వలి వారు రచించిన జగజ్జాన నవల 25 భాగాలను.. కొవ్వలి తనయుడు లక్ష్మీనారాయణకు బహూకరించారు. 65 సంవత్సరాలుగా తన తల్లి మహంకాళమ్మ సేకరించి, దాచిపెట్టిన జగజ్జాన నవలను తాను కాపాడుకుని, నేడు వారి కుటుంబానికి అప్పగించడం మధురమైన సంఘటన అని సుశీల అన్నారు. కొవ్వలి లక్ష్మీనరసింహారావు భయంకర్ అనే కలం పేరుతో ఈ నవలను రచించారని గుర్తు చేశారు. జయశ్రీ, రాణి అనే కలం పేర్లతో కూడా నవలా రచన సాగించారని తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త దుగ్గిరాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ జగజ్జాన నవలను ప్రచురణ తర్వాత 50 ఏళ్ల అనంతరం స్వాతి పత్రికలో ప్రచురిస్తే ఎంతో ఆదరణ పొందిందన్నారు. కార్యక్రమంలో అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, కథా రచయిత పెనుమాక నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణకు నవలను అందచేస్తున్న సుశీల

పొలాల్లో మంటలతో అన్ని విధాలా తంటాలే..

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పొలంలో పంట కాలం ముగిసిన తర్వాత వ్యర్థాలను తగులబెట్టడం వలన భూమిలో ఉంటూ పంటలకు మేలు చేసే వివిధ రకాల కోట్లను కోట్ల సూక్ష్మజీవులు నశించి భూమి సాంద్రత తగ్గిపోతుందని నాణ్యమైన దిగుబడులు సాధ్యం కాదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ. మురళీ అన్నారు. ప్రస్తుతం వరి నూర్పిడి అనంతరం వరి వ్యర్థాలను తగులబెట్టడం సరికాదన్నారు. ఇలా చేయడం వలన పర్యావరణానికి ఎంతో నష్టం వాటిల్లుతుందని వివరించారు. వరి పంట నూర్పిడి అనంతరం వ్యర్థాలను తగులబెట్టడం వలన వాటిల్లే నష్టాలను వివరించారు. భూమిలోని సూక్ష్మ జీవుల వలన కలిగే ప్రయోజనాలు, సూక్ష్మ జీవులు అంతరించి పోవడం వల్ల కలిగే నష్టాలను ఆయన వివరించారు. ఒకసారి పంట పొలంలో వ్యర్థాలను తగుల బెట్టడం వలన 25 ఏళ్ల పాటు భూమిలో ఉండాల్సిన సూక్ష్మ పోషకాలు నశించి పోతాయని పంట వ్యర్థాలు తగుల బెట్టడం వలన చివరకు నేలలు, పంటలు పండించేందుకు అవకాశం లేకుండా నిస్సారమైపోతాయన్నారు. పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు పంట వ్యర్థాలు తగులబెట్టడం వలన అంతరించి పోతాయని వాటిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు.

1) భూమిని సారవంతం చేయడంలో తోడ్పడతాయి. 2)మొక్కలకు అన్ని రకాల పోషక పదార్థాలు అందించడంలో తోడ్పడతాయి. 3) మొక్కల వ్యర్థాలు, సేంద్రియ పదార్థాలు భూమిలో కుళ్ళుటకు తోడ్పడుతాయి. 4) భూమిలో ఉదజని సూచిక తటస్థంగా ఉంచి అన్ని రకాల పంటలు పండుటకు తోడ్పడతాయి. 5) భూమిని గుల్లగా మార్చి నీరు, గాలి పట్టి ఉంచి మొక్కలకు అందిస్తాయి.

మనం రసాయన ఎరువులు భూమిలో వేసినప్పుడు అవి మొక్క తీసుకునే రూపంలో మార్చుటకు ఈ సూక్ష్మజీవులు తోడ్పడతాయి 7) నేలలు చౌడు భూములు కాకుండా ఈ సూక్ష్మజీవులు కాపాడుతాయి. 8) ఈ సూక్ష్మజీవులు పంటపై చీడపీడలు రాకుండా కాపాడతాయి.

ఎల్ఐసి బలోపేతానికి చర్యలు తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎల్ఐసి పనిచేస్తోందని చెప్పారు. ఎల్ఐసి ప్రభుత్వరంగ సంస్థగా ఆవిర్భవించిన రోజును పురస్కరించుకొని అసోసియేషన్ ఆధ్వర్యంలో 'పటిష్టమైన ఎల్ఐసి-పటిష్టమైన భారత్' నినాదంతో దేశవ్యాప్త ప్రచార కార్యక్రమం చేపట్టామన్నారు. 25 ఏళ్లుగా దాదాపు 25 కంపెనీల పోటీని తట్టుకుంటూ 70 శాతంపైగా బీమా మార్కెట్‌కు ఎల్ఐసి లీడర్‌గా ఎదిగిందన్నారు. అయితే ప్రభుత్వాలు ఎల్ఐసిని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేపడుతున్నాయని, కేంద్రంలోని ప్రస్తుత ఎన్‌డిఎ ప్రభుత్వం బీమా రంగంలో విదేశీ పెట్టుబడులను 74 శాతం నుండి వందశాతానికి పెంచాలని చేసిన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీమా ప్రీమియంపై విధించిన 18 శాతం జిఎస్‌టి పాలసీదారులకు భారంగా మారిందన్నారు. అసోసియేషన్ సుదీర్ఘ పోరాట ఫలితంగా పార్లమెంట్‌లో, దేశ వ్యాప్తంగా చర్చ జరిగిన తర్వాత జిఎస్‌టి కౌన్సిల్ పరిశీలనలో ఈ విషయం ఉందన్నారు. తక్షణమే ప్రీమియంపై జిఎస్‌టి రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవాలని కోరారు. బీమా మార్కెట్ రెగ్యులేటరీగా ఉన్న ఐఆర్‌డిఎఐ ఇటీవల చేసిన ప్రతిపాదనలు ఎల్ఐసిని బలహీన పరిచేవిగా ఉన్నాయన్నారు. కాంపోజిట్ ఏజెంట్ విధానం ఉపసంహరించాలన్నారు. కనీస ఇన్సూరెన్స్ లక్ష రూపాయల నుండి రూ.2 లక్షలకు పెంచటం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఆసక్తి చూపించారని తెలిపారు. పాలసీ సరెండర్ సమయాన్ని కూడా మూడేళ్ల నుండి ఏడాదికి తగ్గించటం సరికాదన్నారు. ఐఆర్‌డిఎఐ ప్రతిపాదనలు ఉపసంహరించుకొని, బలోపేతం చేసే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ ఎల్ఐసి పరిరక్షణకు, మరింత శక్తివంతం చేసేందుకు విశాలమైన రీతిలో ప్రచారాన్ని కొనసాగిస్తామని చెప్పారు. సమావేశంలో డివిజనల్ ఉపాధ్యక్షులు ఎమ్‌డి.కౌసర్‌జానీ, మహిళా ఉద్యోగులు సమన్వయ కమిటీ డివిజనల్ కన్వీనర్ సిహెచ్.మధుబాల, ఆర్‌విఎస్ శ్రీనివాస్, పి.ఆర్.రాజశేఖర్, వి.ఆర్.గోపాలకృష్ణ, పి.ఎస్.నాగేంద్రరెడ్డి పాల్గొన్నారు.

దేశంలోనే తొలి ఈ-ట్రాక్టర్

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువకాలం సేవలు అందించే ఈ ట్రాక్టర్ రైతులకు ఎంతో లాభదాయకమన్నారు. అగ్రికల్చర్, హార్టికల్చర్ పనులకు సాధన ట్రాక్టర్లను రైతులు ఏ విధంగా వినియోగిస్తారో ఈ ట్రాక్టర్‌ను అదేవిధంగా ఉపయోగించవచ్చున్నారు. గ్రామపంచాయతీలు మున్సిపాలిటీల్లో ఇలాంటి ట్రాక్టర్లు తీసుకువచ్చేలా ఆలోచన చేస్తామన్నారు. రైతులకు సబ్సిడీతో ఈ ట్రాక్టర్లు అందుబాటులోకి వచ్చే విధంగా ప్రణాళిక రూపొందిస్తామన్నారు. రాష్ట్రంలో భారీ స్థాయిలో ఛార్జింగ్ స్టేషన్లో అందుబాటులోకి తెచ్చేలా సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ సోలార్ వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ వాతావరణ, ధ్వని కాలుష్యాన్ని నివారించి, గ్రీన్ ఎనర్జీని పెంపొందించడానికి ఎలక్ట్రికల్ వాహనాలు ఉపయోగపడతాయన్నారు. మురుగన్ గ్రూప్ సీఈఓ కె.హరిచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఐదు గంటలు ఛార్జింగ్ పెడితే ఐదు టన్నుల భారాన్ని ఈ ట్రాక్టర్ మోయగలదన్నారు. అన్ని పరీక్షలూ చేసిన తర్వాతే రైతులకు అందుబాటులోకి తెచ్చామని వివరించారు.

రైలు గేటు మూసివేత

ప్రజాశక్తి తెనాలి

పట్టణంలోని మారిస్‌పేటలోగల రేపల్లె గేటుకు ఎదురుగా ఉన్న మద్రాసు గేటును మూడు రోజుల పాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మూడో రైల్వే లైను పనుల కోసం సోమవారం ఉదయం 7 నుంచి బుధవారం సాయంత్రం 5 గంటల వరకు గేటును మూసి వేస్తున్నామని, ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకుని సహకరించాలని కోరారు.

అంబేద్కర్‌కు నివాళి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి ఐతానగర్ రజక చెరువు సెంటర్లో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్ కుమార్ ఆదివారం సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ ఐక్యవేదిక సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు అక్కిదాసు కిరణ్ కుమార్, మాల మహానాడు డివిజన్ అధ్యక్షులు కనపర్తి అనిల్, కౌన్సిలర్ యాతాటి అనిల్, యనమద్రి శ్యామ్, పిల్లి ప్రేమ్ కుమార్, కందుల ఏసుబాబు, బండ్లమూడి నాని, నల్లగండ్ల రవిచంద్ర, గెడ్డటి ఆశిష్, కనపర్తి జేసు బాబు, గోళ్ళ సందీప్, జంగం హర్ష, ఉన్నవ సాల్మన్, యాతం జయప్రకాష్, పెరికల అరుణ్ కుమార్, కనపర్తి శశి తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంపై నిర్లక్ష్యం తగదు..

ప్రజాశక్తి-గుంటూరు

ప్రస్తుత రోజుల్లో మధుమేహం సమస్యను పెద్ద మహమ్మారిగా భావించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ వైద్యులు నందిపాటి వెంకట సందీప్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలో ఆదివారం మధుమేహం, దాని వల్ల వచ్చే ఇతర అనారోగ్య సమస్యలపై నిర్వహించిన ఆరోగ్య సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. మధుమేహం వల్ల రక్త సరఫరా చేసే నరాలు దెబ్బ తింటాయని, శరీరంలో అన్ని అవయవాలూ దెబ్బతినే ప్రమాదం ఉందని చెప్పారు. ప్రతి ఒక్కరూ 40 ఏళ్ల దాటిన తర్వాత సంవత్సరానికి ఒక్కసారి షుగర్ పరీక్ష చేయించుకుంటే మంచిదని సూచించారు. మధుమేహంలో ఉన్న చికిత్స విధానాలు వివరించారు.

కోడి పందాల నిర్వాహకుల అరెస్ట్

ప్రజాశక్తి-తెనాలి

కోడి పందాల నిర్వాహకులను పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని కొలవరం సమీపంలో కోడి పందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ సి.హెచ్ ప్రతాప్‌కుమార్ సిబ్బందితో ఆదివారం మధ్యాహ్నం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పందాలు నిర్వహిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కోడి, రూ.1,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. పందాలు, జూదం వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే సహించేదిలేదని ఎస్సై హెచ్చరించారు.

సామాజిక అవసరాలకు అనుగుణంగా..

విద్యావిధానాల రూపకల్పన

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థుల సామర్థ్యాలను ప్రపంచ స్థాయికి తీసుకువచ్చి ఉన్నత విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని హైదరాబాద్‌లోని టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ స్టడీస్ ఛైర్మన్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రితేష్ ఖున్యాకరి అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్శిటీలో 'కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్ ఆన్ హార్నెస్సింగ్ ద సైన్స్, టెక్నాలజీ అండ్ సొసైటీ రిలేషన్‌షిప్ ఫర్ మీనింగ్‌ఫుల్ హయ్యర్ ఎడ్యుకేషన్' అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్‌ను ఆదివారం ఘనంగా ముగించారు. డాక్టర్ రితేష్ ఖున్యాకరి మాట్లాడుతూ సైన్స్, టెక్నాలజీ, సమాజం మధ్య సంబంధాన్ని సులభంగా అర్థం చేసుకోవడమే కాకుండా, ఇది ఉన్నత విద్యలో సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రామాణికమైన మార్పులకు వర్క్‌షాప్ దోహద పడుతుందన్నారు. సామాజిక అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాల రూపకల్పన జరగాలన్నారు. సమాజానికి అవసరమైన నైపుణ్యాలు, టెక్నాలజీ సంబంధిత మార్పులను అధ్యాపకులు ఎప్పటికప్పుడు గుర్తించాలన్నారు. ఉన్నత విద్యలో తరగతులు, కోర్సులు, రీసెర్చ్ కార్యక్రమాలను ప్రజల అవసరాలకు అనుగుణంగా దగ్గర చేయాలన్నారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. ముగింపు కార్యక్రమంలో హైదరాబాద్‌లోని టిస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అర్జున్ సేన్‌గుప్త, ముంబాయిలోని టిస్ సీనియర్ రీసెర్చ్ కోఆర్డినేటర్ డాక్టర్ రఫిక్ షేక్, విజ్ఞాన్స్ ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఖున్యాకరిని సత్కరిస్తున్న వీసీ తదితరులు

వాలంటీర్ల నిర్బంధం.. ప్రజాస్వామ్య విరుద్ధం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలన్న డిమాండ్‌తో రాష్ట్ర సచివాలయ ముట్టడికి వాలంటీర్ల సంఘం పిలుపునిచ్చిన నేపథ్యంలో అసోసియేషన్ నాయకులను ఎక్కడికక్కడ గృహ నిర్బంధం చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఏపీ గ్రామ, వార్డు వాలంటీర్ల అసోసియేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారు ఈదర గోపీచంద్ అన్నారు. వాలంటీర్లు తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందజేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. రూ.5 వేలు గౌరవ వేతనం తీసుకుంటూ, విశేష సేవలు అందించిన వాలంటీర్లకు రూ.10 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం.. అధికారంలోకి రాగానే వారిపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పేద నిరుద్యోగ యువతీ, యువకులను ప్రభుత్వం మోసం చేయడం సరికాదన్నారు. కనీసం గత ప్రభుత్వం మాదిరి రూ.5 వేలు గౌరవ వేతనంతో 2.50 లక్షల మంది వాలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అవోపా ఆధ్వర్యంలో పేదలకు పెన్షన్ల పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేటలోని అవోప కార్యాలయంలో ఆదివారం సంస్థ అధ్యక్షులు కె.వి.బ్రహ్మం అధ్యక్షతన 108 మంది పేదలకు పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఇన్‌కంట్యాక్స్ జాయింట్ కమిషనర్ ఎ.తాండవకృష్ణమూర్తి, బచ్చు తేజో(శ్రీనివాస్‌కుమార్, గుంటూరు జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ వేల్పూరి వెంకటేశ్వర్లు, గౌరవ కార్యదర్శి గార్లపాటి సత్యనారాయణ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని పెన్షన్లు అందించారు. ఈ సందర్భంగా జాయింట్ కమిషనర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ప్రతినెలా 108 మంది పేదలకు రూ.500 చొప్పున పెన్షన్, విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. తేజో శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ అవోపా కార్యక్రమాలకు తమ వంతు సహాయం అందిస్తామని, ఒకనెల పెన్షన్ రూ.60 వేలు విరాళంగా ఇస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా అడ్డగాళ్ల రామారావు పేద విద్యార్థులకు రూ.20వేలు ఉపకార వేతనం అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి రాధాకృష్ణయ్య, మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయి రమేష్, పెన్షన్ కన్వీనర్ వెంకట్రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాచపూడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అనధికార కుళాయిలు తొలగించాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో వార్డు సచివాలయాల వారీగా అనధికార కుళాయిల తొలగింపుపై ఇంజినీరింగ్, రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఆదివారం కమిషనర్.. శ్యామల నగర్, హౌసింగ్ బోర్డ్‌కాలనీ, బ్రాడీపేట, లక్ష్మీపురం, పెద్దపలకలూరు రోడ్ ప్రాంతాల్లో పారిశుధ్యం, అభివృద్ధి పనులను, గుజ్జనగుండ్ల సెంటర్‌లో వెండింగ్‌జోన్ ప్రతిపాదిత ప్రాంతాలను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. తొలుత శ్యామలానగర్‌లో నిర్మాణంలో ఉన్న అపార్ట్మెంట్‌కు అనధికారికంగా మున్సిపల్ ట్యాప్‌లు ఉండటం గమనించి.. సంబంధిత పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం తొలగించాలని ఆదేశించారు. నూతన భవన నిర్మాణ ప్లాన్ మంజూరుకు ముందే గతంలో ఉండే హౌస్ ట్యాప్ కనెక్షన్ని తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టం చేశారు. బహుళ అంతస్తు భవనాల్లో ఫ్లాట్ల వారీగా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం వేచి ఉండకుండా ఆస్తి పన్ను విధించాలని అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లను ఆదేశించారు. నివాస ప్రాంతాల్లో గేదెల డెయిరీ ఏర్పాటు చేసి, వ్యర్థాలను డ్రైన్‌లోకి వదులుతున్న వారికి నోటీసులు జారీ చేయాలని శానిటరీ ఇన్స్పెక్టర్‌ని ఆదేశించారు. పలు ప్రదేశాల్లో డ్రైన్ల శుభ్రం చేయడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, ప్రతి రోజు మధ్యాహ్నం సమయంలో గ్యాంగ్ వర్క్ ద్వారా కాల్వలు శుభ్రం చేయాలని, డెబ్రిస్‌ని ప్రత్యేకంగా ట్రాక్టర్లను తీసుకొని లిఫ్ట్ చేయాలని సూచించారు. అనంతరం గుజ్జనగుండ్ల ప్రాంతంలో స్థానిక కార్పొరేటర్ మానం పద్మశ్రీ, పట్టణ ప్రణాళిక అధికారులు, స్ట్రీట్ వెండర్స్‌తో కలిసి పర్యటించారు. త్వరలో గుజ్జనగుండ్ల ప్రాంత వీధి వ్యాపారులకు అనువుగా ఉండేలా వెండింగ్ జోన్‌ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. పర్యటనలో ఏసిపి రెహ్మాన్, డిఈఈలు రమేష్ బాబు, శ్రీనివాసరావు, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉండవల్లి ఎత్తిపోతల డ్యాం వద్ద పోలీసుల పరిశీలన

కృష్ణా నదిలో యువకుడి గల్లంతు

ప్రజాశక్తి -తాడేపల్లి రూరల్

సరదాగా ఈతకు యువకుడు గల్లంతైన ఘటన ఆదివారం ఎంటిఎంసి పరిధిలోని ఉండవల్లి ఎత్తిపోతల పథకం లాకులు వద్ద చోటు చేసుకుంది. విజయవాడకు చెందిన చాట్ల బాలు (18) అనే యువకుడు కృష్ణా నదిలోకి ఈత కొట్టేందుకు దిగాడు. ప్రమాదవశాత్తు నదిలో మునిగి గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న తాడేపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, బాలు దిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అప్పటికే రాత్రి కావడంతో, సోమవారం గాలింపు చర్యలు చేపడతామని తాడేపల్లి సీఐ కళ్యాణ రాజు తెలిపారు.

గల్లంతైన యువకుడు బాలు(ఫైల్ ఫొటో)

రైలు నుండి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- రెంటచింతల

ప్రయాణికులతో కిక్కిరిసిన రైలు ఎక్కుతూ, ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన రెంటచింతల రైల్వే ప్లాట్‌ఫాం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. జీఆర్‌పీ ఎస్సై వెంకట్రామయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాలువాయి గ్రామానికి చెందిన తమ్మిశెట్టి ఏడుకొండలు(42) తన కుమార్తె స్రవంతితో కలసి గుంటూరు బయలుదేరాడు. రైలు ఎక్కుతున్న సమయంలో చెప్పులు జారిపడ్డాయి. వాటిని తీసుకునే క్రమంలో రైలు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయన ముఠామేస్త్రిగా పని చేస్తుంటాడు. మృతునికి భార్య పద్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించి, రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి తీగలు చోరీ

ప్రజాశక్తి- రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలలో ఆర్‌అండ్‌బీ రహదారి పక్కన పొలాలకు ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్ లో రాగి తీగలు చోరీకి గురైనట్లు బాధిత రైతు టి.రాయపురెడ్డి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. సుమారు రూ.30 వేలు నష్టం సంభవించిందన్నారు. మిర్చి పైరు అదునులో ఉన్న సమయంలో తీగలు చోరీకి గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి, బాధిత రైతు నుంచి వివరాలు సేకరించారు.

బోర్‌వెల్స్‌లో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-నాదెండ్ల

సిలిండర్ పేలి అగ్నిప్రమాదం సంభవించిన సంఘటన మండలంలోని గణపవరం గ్రామం శివప్రియ నగర వద్ద విద్యాధరి బోర్‌వెల్స్ కార్యాలయంలో ఆదివారం చోటుచేసుకుంది. బోర్‌వెల్ కూలీలు సాయంత్రం వంట చేసుకునేందుకు ఉపక్రమించగా సిలిండర్ రెగ్యులేటర్ వద్ద లీకై, ఒక్కసారిగా మంటలు రేగాయి. దీంతో కార్యాలయ గది ధ్వంసం అయింది. లోపల ఉన్న వంట సామగ్రి, దుస్తులు కాలిపోయాయి. చిలకలూరిపేట ఫైర్ ఆఫీసర్ కిరణ్ కుమార్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ప్రజాశక్తి-తెనాలి

ఒక వ్యక్తి మీద దాడి చేసి గాయపరిచిన ఘటనలో నలుగురిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన హరికృష్ణ మాజీ రైల్వే కాంట్రాక్టరు వద్ద పని చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం ముగ్గురు యువకులు రైల్వే కేబుల్ వైరును చోరీ చేసేందుకు ప్రయత్నించగా.. హరికృష్ణ వారిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. వారిలో ఒకరిని పట్టుకుని జీఆర్పీ పోలీసులకు అప్పగించాడు. దీనిని మనసులో పెట్టుకున్న దాసరి చేతన్, దేవరపల్లి మణి, బాలాజీ, గోపీనాథ్ తదితరులు హరికృష్ణపై శనివారం దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మండాది 1359 నాటి శాసనం గుర్తింపు

ప్రజాశక్తి- మాచర్ల

ముళ్లచెట్ల మధ్య శాసనరాయిని చూపుతున్న సతీష్‌బాబు

వెల్దుర్తి మండలంలో మండాదిలో క్రీ.శ. 1359 నాటి శాసనాన్ని మాచర్ల పట్టణానికి చెందిన చరిత్ర పరిశోధకులు, రచయిత పావులూరి సతీష్‌బాబు గుర్తించారు. దుర్గి మండలం నుండి తేరాల మార్గంలో వెల్దుర్తి మండలం మండాది శివారులోని ఆంజనేయస్వామి గుడి వద్ద రోడ్డు పక్కన పిచ్చికంప చెట్ల మధ్య శిథిల నంది శిలా శాసనాన్ని గుర్తించినట్లు సతీష్ చెప్పారు. ఈ నంది శిలా శాసనం క్రీ.శ. 1359 నాటిదని, భారత పురవస్తుశాఖ వారు 1930లో ఈ శాసనాన్ని నకలు తీశారని అన్నారు. శాసనంలో పల్నాటి సీమలోని మండాది గ్రామం మల్లిఖార్జున స్వామి మధ్యాహ్న సేవలు, అంగరంగ వైభవాలకు తంగెడ మాచలనాయుడు కుమారుడు సిరిగిరినాయిడు మందాడి గ్రామాన్ని దానం ఇచ్చినట్లు, దేవాలయ కంభం పాడైతే నల్లపు మల్లయ్య కొత్త కంభం ఎత్తించాడని శాసనంలో ఉందని తెలిపారు. ఈ శాసన బండ పక్కనే మరొక చిన శిథిల శాసనం ఉంది. ఈ శాసనంలోని అక్షరాలు పూర్తిగా శిథిలమై చెరిగిపోయాయి. మన వారసత్వ సంపదను కాపాడుకోవాలని, శిథిలమవుతున్న ఈ శాసనాలను దేవాలయంలోకి మార్చి రక్షణ కల్పించాలని గ్రామస్తులకు సతీష్‌బాబు సూచించారు.

ఏప్రిల్‌లో సుందరయ్య కళానిలయం జాతీయస్థాయి నాటికల పోటీలు

ప్రజాశక్తి - యడ్లపాడు

పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం జాతీయస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు ఏప్రిల్ 4,5,6 తేదీల్లో నిర్వహిస్తామని సంస్థ అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు ఆదివారం తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రమైన యడ్లపాడులోని తన నివాసంలో వివరాలు వెల్లడించారు. పుచ్చలపల్లి సుందరయ్య పేరిట ప్రతి సంవత్సరం యడ్లపాడులో పండుగ వాతావరణంలో నాటకోత్సవాల నిర్వహణ దశాబ్దాల నుంచి ఆనవాయితీగా వస్తోందన్నారు. పోటీల నిర్వహణ ప్రతిసారీ విభిన్న తరహాలో నిర్వహించాలనే సంకల్పంతో కమిటీ సభ్యులు ఉన్నట్లు చెప్పారు. త్వరలోనే నాటికలను పరిశీలించి ప్రదర్శనలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ముత్తవరపు రామారావు, పోపూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్ కుటుంబానికి సిఐటియు సాయం

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

అనారోగ్యంతో ఇటీవల మరణించిన అంగన్వాడీ టీచర్ ఎం.కుమారి కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు నాయకులు అండగా నిలిచారు. ఆదివారం కుమారి కుటుంబ సభ్యులకు రూ. 30 వేల సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బండ్ల మహేష్ మాట్లాడుతూ కుమారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వేముల వెంకటరావు, అంగన్వాడీ యనియన్ నాయకులు ఉష, శివ కుమారి పాల్గొన్నారు.

వైభవం కోల్పోయిన నాపరాయి

భారీగా తగ్గిన డిమాండ్ - అమ్మకాలు లేక వ్యాపారులు, పనుల్లేక కార్మికులకు ఇబ్బందులు

రాయవరం గ్రామంలోని నాపరాయి క్వారీ

ప్రజాశక్తి- మాచర్ల

కొద్ది నెలలుగా నాపరాయి వ్యాపారం కుంటుపడింది. నిర్మాణ రంగం నెమ్మదించటంతో నాపరాయికి భారీగా డిమాండ్ తగ్గింది. దాంతో వ్యాపారాలు లేక నాపరాయి వ్యాపారులు, పనులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

పల్నాడు జిల్లాలో నాపరాయి గనులకు పెట్టింది పేరు మాచర్ల ప్రాంతం. మాచర్ల నియోజకవర్గ పరిధిలోని పలు మండలాలలో నాపరాయి గనులు విస్తారంగా ఉన్నాయి. మాచర్ల గనులలో లభించే నాపరాయి ఎంతో నాణ్యమైనది. నాపరాయి క్వారీల ద్వారా తీసే ఇక్కడి రాయి రాష్ట్ర స్థాయిలో మంచి పేరు ఉంది. ఇక్కడి నాపరాయి రెండు తెలుగు రాష్ట్రాల్లో కాక, ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతి అవుతుంది. ఈ నాపరాయికి 'మాచర్ల రాయి' అని పేరు. దీన్ని ఎక్కువగా పరిశ్రమలకు, పలు రకాల మిల్లులకు, కోల్డు స్టోరేజ్, యార్డులు, ఇంటి ఆవరణ తదితర వాటికి విరివిగా నివియోగిస్తున్నారు. దాంతో మాచర్ల నాపరాయికి మంచి డిమాండ్ ఉంది.

ఈ ప్రాంతంలో వెల్దుర్తి, దుర్గి, మాచర్ల, రెంటచింతల మండలాలలో నాయరాయి గనులున్నాయి. ఈ పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 10 వేల మంది కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారు. వెల్దుర్తి మండలంలో వందల ఎకరాల్లో నాపరాయి గనులున్నాయి. మండలంలోని మండాది, రచ్చుమల్లపాడు గ్రామాల్లో పలు నాపరాయి క్వారీలున్నాయి. డిమాండ్‌ను బట్టి గనుల నుండి నాపరాయి వెలికితీసి సరఫరా చేస్తారు. దుర్గి మండలంలోని తేరాల, పోలేపల్లి, ఆత్మకూరు గ్రామాల్లో నాపరాయి గనులున్నాయి. ఇక్కడ నుండి ప్రతిరోజూ నాపరాయి వెలికితీసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి జరుగుతుంది. ఆయా గ్రామాల్లోని పలు కుటుంబాలకు ఈ నాపరాయి క్వారీలే జీవనాధారం.

మాచర్ల మండలంలోని రాయవరం గ్రామంలో విస్తారంగా నాపరాయి గనులున్నాయి. వందల ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ గనుల నుండి ప్రతి రోజు పెద్దఎత్తున నాపరాయి ఎగుమతి అవుతుంది. మాచర్ల పట్టణానికి శివారు ప్రాంతం ఈ రాయవరం. మాచర్ల, రాయవరంలకు చెందిన వందలాది కుటుంబాలు ఈ నామరాయి క్వారీలలో కార్మికులుగా పనిచేస్తున్నారు. రెంటచింతల మండలంలో పలు గ్రామాల్లో వేల ఎకరాలలో నాపరాయి గనులు విస్తరించి ఉన్నాయి. గోలి, జెట్టిపాలెం, పశర్లపాడు, తుమ్మకోట గ్రామాల పంచాయితీల పరిధిలో పలు నాపరాయి క్వారీలు ఉన్నాయి. ఇక్కడ లభించే రాయి అత్యంత నాణ్యమైనది. మిగితా మండలాలతో పొల్చుకుంటే ఇక్కడ నుండే అధికంగా నాపరాయి ఉత్పత్తి అవుతుంది.

తగ్గిన డిమాండ్

నిర్మాణ రంగం మందగించటం, గ్రానైటు, టైల్స్‌వైపు ప్రజలు మొగ్గు చూపటంతో నాపరాయికి డిమాండ్ తగ్గింది. గతంలో మాచర్ల పరిసరాల నుండి రోజుకు 60 నుంచి 70 లారీలు నాపరాయి రవాణా అవుతుండేది. వందలాది కుటుంబాలు ఇక్కడి క్వారీల్లో పనిచేసేవారు. గ్రామాలకు గ్రామాలే క్వారీ పనలే జీవనాధారంగా ఉండేది. ఒక్క గోలి గ్రామంలోనే 90 శాతం కుటుంబాలు ఈ క్వారీలలోనే పనిచేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఒకప్పుడు పల్నాడు ప్రాంతంలో బేసు మట్టం నుండి, గోడలు, పై కప్పు మొత్తం నాపరాయితోనే నిర్మించేవారు. ఇప్పుడు టైల్స్, మార్బుల్స్ రావటంతో నాపరాయి వినియోగం తగ్గింది. గతంలో పల్నాటిలోని పలు గ్రామాల్లో రోడ్లు నాయరాయి బండలతో వేసేవారు. ఇప్పటికి కొన్ని బండ్ల బజార్లు పలు గ్రామాల్లో ఉన్నాయి. వాటి స్థానంలో సిమెంట్ రోడ్లు వేయటంతో నాపరాయి వినియోగం తగ్గింది.

ఖర్చు, ధర

ఒక అడుగు నాపరాయి వెలికితీసి రవాణాకు సిద్ధం చేయటానికి రూ.5 నుండి రూ.5.50 వరకు ఖర్చవుతుండగా, రూ.6 నుండి 6.50కు ఎగుమతి చేస్తున్నారు. నాపరాయి వెలికి తీయటానికి కార్మికులకు అడుగుకు రూ.2 నుండి రూ.2.50 కూలీగా చెల్లిస్తారు. పెరిగిన క్వారీ లీజు రుసుము, డీజల్‌తో మరింత ధరలు పెరిగే అవకాశం ఉందని నాయరాయి లీజుదారులు చెబుతున్నారు.

క్వారీ లీజులు భారం, పరిశ్రమను కాపాడుకోవాలి

నాపరాయి క్వారీల లీజు హెక్టారుకు (రెండున్నర ఎకరాలు) రూ.52 వేలుండేది. లీజుల మార్పులు చేర్పులతో లీజు దారులకు భారంగా మారటంతో లీజులు రద్దు చేసుకున్నారు. గతంలో మాచర్ల, రెంటచింతల, వెల్దుర్తి, దుర్గి మండలాలలో 70 పైగా అధికారింగా లీజు దారులు ఉండగా, అనధికార గనులు కొన్ని ఉండేవి. పెరిగిన లీజు, డీజల్ ధరలు, తగ్గిన వినియోగంతో కొందరు లీజు దారులు వెనక్కి తగ్గారు. పెరిగిన ధరలతో క్వారీలో పనిచేసే కార్మికులు, రవాణా రంగంలో పనిచేసే కార్మికులు ఇబ్బందులు పడతారని, కావున క్వారీ లీజు ధరలు తగ్గించాలని వ్యాపారులు కోరుతున్నారు.

నాపరాయి క్వారీల ద్వారా సీనరేజి రూపంలో పంచాయతీలకు లక్షలాది రూపాయల ఆదాయం లభిస్తుంది. ఆదాయం ఉన్నప్పటకీ కొన్ని పంచాయతీలు ఇప్పటకి మౌలిక సదుపాయాల కొరతను ఎదుర్కొంటున్నాయి. క్వారీల మీద మైనింగ్ శాఖకు ఏటా రూ.లక్షలు ఆదాయం వస్తుంది. నాపరాయి క్వారీలలో పనిచేసే వందలాది కార్మికులు పలు ప్రమాదాలకు గురవుతూ, ప్రాణాలపైకి తెచ్చుకుంటున్న సందర్భాలు అనేకం. క్వారీల్లో రాయి తొలిచే సమయంలో, మలచిన రాయిని లారీలకు లోడు ఎత్తుతున్నప్పుడు ప్రమాదాలకు గురై సరైన వైద్యం చేయించుకునే స్తోమత లేక శాశ్వత వైకల్యానికి గురైన కార్మికులు అనేక మంది ఉన్నారు. నాపరాయి క్వారీలలో పనిచేసే కార్మికులకు తరచూ ప్రమాదాల బారిన పడే అవకాశం ఉన్నందున వారికి బీమా సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉంది. రక్షతో పాటు పనులు లేని సమయంలో నాపరాయి కూలీలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది. నాపరాయి కార్మికులకు ప్రత్యమ్నాయ ఉపాధి కల్పనకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

ఒకటి రెండ్రోజులే పని

వారానికి ఒకట్రెండు రోజులే పనులుంటున్నాయి. నేను మా ఆయన ఇదే పని చేస్తాం. పనుల్లేని రోజులు ఇల్లు గడవటం కష్టంగా ఉంటుంది. పై నుంచి ఆర్డల్లు లేక పనులు ఇవ్వలేక పోతున్నామని ఓనర్లు చెబుతున్నారు. ఓనర్లు ఇంతకు ముందు రాయి ఆర్డర్లు లేకపోయినా ముందుగానే రాయి కొట్టి పక్కన పెట్టుకునేవారు. దాంతో మాకు రోజు పని ఉండేది. ఇప్పుడు సరుకు తొందరగా అమ్ముడుపోకపోవటంతో మాకు కూడా పనులు లేకుండా పోయాయి.

రమణమ్మ, నాపరాయి కూలీ, మాచర్ల

పనుల్లేక ఇల్లు గడవటం కష్టంగా ఉంది. మా కుటుంబం మొత్తం ఇదే పనిచేస్తాం. పనులు చాలా తగ్గాయి. రాయికి గిరాకీ లేదంటున్నారు. పనులు లేని మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి. పనులు లేని సమయంలో ప్రభుత్వం ఎదో ఒకటి పని కల్పించాలి.

లక్ష్మీ, నాపరాయి కూలీ, మాచర్ల

అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని వామపక్షాలు నిరసన

ప్రజాశక్తి - క్రోసూరు : భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి క్షమాపణలు చెప్పాలని కోరుతూ ఆయన రాష్ట్రంలో పర్యటించడానికి నిరసిస్తూ పల్నాడు జిల్లాలో వామపక్షాలు ఆదివారం ప్రదర్శనలు చేపట్టాయి. ఇందులో భాగంగా మండల కేంద్రమైన క్రోసూరులోని అంబేద్కర్ సెంటర్ వద్ద నిరసనలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు మాట్లాడారు. అందరికీ స్వేచ్ఛ, సమానత్వాలు అందించిన రాజ్యాంగం అంటే బిజెపికి గిట్టదని, అందుకు అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నారు. బీఎస్పీ నియోజకవర్గ నాయకులు జి.శేఖర్ మాట్లాడుతూ బిజెపి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని నిరంతరం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ విషయాన్ని రాష్ట్రంలోని టిడిపి, జనసేన, వైసికి గుర్తించాలన్నారు. సిపిఐ, సిపిఎం మండల కార్యదర్శులు పి.నాగేశ్వరావు, టి.హనుమంతరావు మాట్లాడుతూ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినా రాష్ట్రంలో రాజకీయ పార్టీలు మౌనంగా ఉండటం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎ.ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, కంచేటి పెద్దబ్బాయి, చిలకా యేసయ్య, కుంభా లక్ష్మయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి :మండల కేంద్రమైన అమరావతిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అమిత్‌షా గోబ్యాక్ అని నినదించారు. నాయకులు మాట్లాడుతూ దేశంలో మతోన్మాద రాజకీయాలు నడుపుతూ ప్రజల మధ్య బిజెపి మత ఘర్షణలు సృష్టిస్తోందని విమర్శించారు. అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణలు చెప్పాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.సూరిబాబు, ఎం.సుబ్రహ్మణ్యం, పౌలు, ఎం.సుబ్బారావు, సిపిఐ నాయకులు బి.రామకృష్ణ, ఎం.శ్రీనివాసరావు, చెన్నకేశవరావు పాల్గొన్నారు.

అమిత్‌షా గో బ్యాక్

జిల్లాలో వామపక్షాల నిరసనల హోరు

మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్

రాజ్యాంగ హక్కులు అనుభవిస్తూ అంబేద్కర్‌ను దూషించడం ఘోరమని నినాదాలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

భారత ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తూ, పరిపాలన చేస్తున్న బిజెపి కేంద్రమంత్రి అమిత్ షా గో బ్యాక్ అని సిపిఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బోసు బొమ్మ సెంటర్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో అమిత్ షా పర్యటన నిరసిస్తూ సిపిఎం, సిపిఐ శ్రేణులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బూరగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య బద్ధంగా పరిపాలన చేయాల్సిన బిజెపి ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా అరాచక పాలన చేస్తుందని ఆయన విమర్శించారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను పార్లమెంటు సాక్షిగా అవమానించిన అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇస్తామని, రాజధాని నిర్మాణానికి, కడప ఉక్కు కర్మాగారానికి నిధులు కేటాయిస్తామని చెప్పిన బిజెపి నాయకులు వాగ్దానాలను అమలు పరచకుండా, రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని ఆయన మండిపడ్డారు. అంతేకాకుండా విశాఖ ఉక్కు ను ప్రైవేట్ పరం చేసేందుకు పూనుకున్న బీజేపీని వ్యతిరేకించకుండా కూటమి పార్టీలైన తెలుగుదేశం జనసేన పార్టీలు బిజెపికి తొత్తులుగా మారారని ఆయన విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ కు తీరని అన్యాయం చేసిన బిజెపి నాయకులకు రాష్ట్రంలో పర్యటించే నైతిక హక్కు లేదని వెంకటేశ్వరరావు అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకే బిజెపి పరిపాలన సాగిస్తుందని ఆయన అన్నారు. అదేవిధంగా వ్యవసాయ మోటార్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు పూనుకున్న బిజెపిని దేశంలో అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారని ఆయన అన్నారు. అంతేకాకుండా ఇప్పటికే అనేకసార్లు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచేసి, నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడానికి కారణమైన బిజెపిని ప్రజలందరూ వ్యతిరేకిస్తున్నారని ఆయన తెలిపారు. సిపిఐ తాడేపల్లి ప్రాంత ఏరియా కార్యదర్శి కంచర్ల కాశయ్య మాట్లాడుతూ కులాల మధ్య, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న బిజెపి మూడవసారి అధికారంలోకి వచ్చి, ప్రజాస్వామ్య వ్యవస్థకు భంగం కలిగించే విధంగా పరిపాలన చేస్తుందని ఆయన మండిపడ్డారు. అంతేకాకుండా కార్మిక రంగాన్ని దెబ్బతీసే లేబర్ కోడ్ ల ను రద్దు చేయాలన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ను అవమానించిన అమిత్ షాను మంత్రివర్గం నుండి భర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి పట్టణ నాయకులు వేముల దుర్గారావు, దొంతి రెడ్డి విజయభాస్కర రెడ్డి, కొట్టే కరుణాకర రావు, వై బర్నబాస్, తాడేపల్లి పట్టణ సిపిఐ కార్యదర్శి తుడిమళ్ళ వెంకటయ్య, మానికొండ డాంగే, సిపిఎం నాయకులు బిట్ర రామారావు, దర్శనపు విజయ్ బాబు, బి గోపిరెడ్డి, వి శాస్త్రి, కే మేరీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కేంద్ర మంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని, సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి డిమాండ్ చేవారు. ఆదివారం అమిత్ షా రాష్ట్ర పర్యటన సందర్భంగా గో బ్యాక్ అమిత్ షా అంటూ ఎంటిఎంసీ పరిధిలోని రాజధాని ముఖ ద్వారమైన ఉండవల్లి సెంటర్లో నిరసన కార్యక్రమాన్ని సిపిఎం శ్రేణులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎం రవి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను పార్లమెంటు సాక్షిగా అవమాన పరిచి, దేశ ప్రజల మనోభావాలను గాయపరిచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకుండా మొండి చేయి చూపి, రాజధానికి నిధులు ఇవ్వకుండా, ప్రపంచ బ్యాంకు అప్పుల ఊబిలోకి నెట్టి ఏపీకి తీరని ద్రోహం చేసిన అమిత్ షాకు ఏపీలో పర్యటించే నైతిక అర్హత లేదని రవి అన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ సీనియర్ నాయకులు ఈమని రామారావు, టీ బక్కిరెడ్డి సిహెచ్ సుందర రావు, పి రాఘవులు, పి గాంధీ, ఉండవల్లి పార్థసారధి, కంచర్ల శేషయ్య, తుమ్మపూడి శివయ్య, వల్లభాపురం మస్తాన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

లౌకిక విధానాలను విస్మరించి అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షా రాజీనామా చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో మండలంలోని చిలువూరు గ్రామంలో నిరసన కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఈమని అప్పారావు ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది వై స్టాలిన్ , మండల నాయకులు జెట్టి బాలరాజు, మండల నాయకులు ఎం నాగమల్లేశ్వరరావు వై బ్రహ్మేశ్వర రావు సిహెచ్ పోతురాజు బి అమ్మిరెడ్డి ఏ పాములు గుడిసేవ యోహాను స్థానికులు కే కోటేశ్వరావు ఎస్ కే కరీముల్లా ప్రేమానందం అర్జున్ టి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం ఆత్మకూరులోని బైపాస్ రోడ్డు వద్ద కేంద్ర హోం మంత్రి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పర్యటన వ్యతిరేకిస్తూ గో బ్యాక్ అమిత్ షా అని వామపక్ష పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఎం పార్టీ మంగళగిరి రూరల్ మండల కార్యదర్శి యు. దుర్గారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ను అవమానిస్తూ పార్లమెంట్లో కేంద్ర హెూం మంత్రి అమీత్ షా వ్యాఖ్యానాల చేయడం దుర్మార్గమని వెంటనే చెప్పాలని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర చేస్తుందని విమర్శించారు. మనువాద సిద్ధాంతమే రాజ్యాంగంగా అమలు చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దళితులకు, గిరిజనులకు, మైనార్టీలకు, కార్మికులకు, రైతులకు ,మహిళలకు అనేక ప్రయోజనకరమైన చట్టాలను రాజ్యాంగంలో పొందుపరిచారని అటువంటి రాజ్యాంగాన్ని తీసివేసి కార్పొరేట్లకు ప్రయోజనకరమైన చట్టాలు తీసుకొచ్చేదానికోసం, మను వాద సిద్ధాంతాన్ని అమలు చేసే దానికోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని తీవ్రంగా విమర్శించారు. అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అవమానిస్తూ మాట్లాడుతుంటే మన రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు మాట్లాడకుండా కూర్చున్నారని ఎద్దేవ చేశారు.. సిపిఐ మంగళగిరి ఏరియా నాయకులు కాబోతు ఈశ్వరరావు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను అవమానిస్తూ మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను, వ్యవసాయ చట్టాలను మార్పులు చేసి కార్మికులకు ,రైతులకు తీవ్రమైన అన్యాయం చేసిందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ ఆత్మకూరు ఒకటవ శాఖ కార్యదర్శి ఎన్ .శ్రీధర్ ,సిపిఐ రూరల్ మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, సిపిఎం, సిపిఐ నాయకులు గడ్డం అజయ్ కుమార్, చిట్యాల జనార్ధన్ రావు, కొండలు, ఆనందం బాబ్జి ,మణికంఠ శర్మ, సురేష్ కుమార్, కిషోర్, గోలి సాంబశివరావు పాల్గొన్నారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను పార్లమెంట్ సాక్షిగా ఎగతాళిగా మాట్లాడి అవమానించిన కేంద్రమంత్రి అమిత్ షా ఆంధ్ర పర్యటనకు నిరసనగా గో బ్యాక్ అమిత్ షా అంటూ కాజా సిపిఎం ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డు వద్ద జరిగిన నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు నాయకులు వుద్దంటి దుర్గారావు , మండల కమిటీ నాయకులు నల్లక శ్రీధర్ భీమిరెడ్డి కోటేశ్వరి డి. నరసింహారావు గాదె గోపాల్ రెడ్డి గాదె మాధవరెడ్డి భీమిరెడ్డి శివారెడ్డి,ఈదాశేఖర్ ఈదా వాసు తమ్మా ప్రసాద్ రెడ్డి పేర్రెడ్డి సత్యమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజధాని లోని నిడమర్రు లో అంబేద్కర్ విగ్రహం ఎదుట అమిత్ షా పర్యటనకు వ్యతిరేకంగా శనివారం సాయంత్రం సిపిఎం నాయకులు నిరసన తెలిపారు. భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను పార్లమెంట్ సాక్షిగా అవమానపరిచిన కేంద్ర మంత్రి అమిత్ షా ఏపీ పర్యటన ను దేశభక్తి గల ప్రజలు వ్యతిరేకించాలని సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు ఎం.రాజజముని, కె.ప్రకాశరావు, కె.బుల్లెబ్బాయి అన్నారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం నాయకులు ఎమ్మెల మరియదాసు పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే నానయ్య ఎం అంకమ్మరావు కుంపటి వీరయ్య, కైలా స్టాలిన్ దూర దేవదాసు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ఫిరంగిపురం మండల కేంద్రంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ని పార్లమెంట్లో హేళనగా మాట్లాడిన కేంద్ర హెూం శాఖ మంత్రి విజయవాడ పర్యటన కు నిరసనగా సొలస బస్టాండ్ లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి ఎస్.ఎం. వలి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా, రాజధానికి నిధులు ఇవ్వకుండా, ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ బ్యాంకు అప్పుల ఊబిలోకి నెట్టి పార్లమెంట్లో భారత రాజ్యాంగ నిర్మాతని హేళనగా మాట్లాడిన అమిత్ షా ఏపీలో పర్యటించే నైతిక హక్కు లేదని, అమిత్ షా తన పదవికి రాజీనామా చేసి భారత ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సిఐటియు నాయకులు అబ్రహం, రామారావు, అనోక్, శామ్యూల్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు

కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా ను తక్షణమే కేంద్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. అమిత్ షా రాష్ట్ర పర్యటనకు వ్యతిరేకంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం సాయంత్రం సిపిఎం నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జె నవీన్ ప్రకాష్,పేరం బాబురావు పి వెంకటేశ్వర్లు,రాములు,సంకూరి కపావరం,కారంకి శేషగిరిరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మేడికొండూరు

భారత పార్లమెంట్లో సాక్షిగా రాజ్యాంగం నిర్మాత డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యటనకు సిపిఎం ఆధ్వర్యంలో పంచాయతీ వర్కర్లు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బొట్ట రామకృష్ణ, సిఐటియు నాయకులు ఎస్ యమ్ భాషా, ఆన్వర్ బాజి, శీలనాగేశ్వరరావు, శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడికొండ

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పై పార్లమెంట్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం శాఖమంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటన సందర్భంగా ఆదివారం వామ పక్షాల ఆధ్వర్యంలో తాడికొండ లోని పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. .అమిత్‌షా గోబ్యాక్ అంటూ నినాదాలు చేసారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, కనగాల పూర్ణ చంద్రరావు,బాణావత్ భద్రయ్య, జోజి, శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు శివ శంకర్ పాల్గొన్నారు.

చిలువూరులో నిరసన

ఉండవల్లిలో నిరసన

తాడేపల్లిలో నిరసన

నిడమర్రులో

మేడికొండూరులో

ఆత్మకూరులో

కాజ బైపాస్ వద్ద

ఫిరంగిపురంలో

తాడికొండలో

ప్రజా గొంతుక పీడీఎఫ్‌కే మన ఓటు

- కెఎస్ లక్ష్మణరావు గెలుపు మనందరి కర్తవ్యం
- యుటిఎఫ్, ప్రజాసంఘాలు

ప్రజాశక్తి - వినుకొండ

ప్రజాస్వామ్య విధానాలకు కట్టుబడి, ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడే పీడీఎఫ్ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా యూటీఎఫ్ రాష్ట్ర ఆడిటర్ పి. ప్రేమ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం కృష్ణ, గుంటూరు ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు గెలుపును కాంక్షిస్తూ ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, ప్రజాసంఘాల ఆత్మీయ సమావేశం పల్నాడు జిల్లా కోశాధికారి ఎం.రవిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ వచ్చే మార్చిలో జరిగే కృష్ణ-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఇద్దరు వ్యక్తుల మధ్య కాదని.. ప్రజా విధానాలకు-

సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

కార్పొరేట్ విధానాలకు మధ్య జరిగే ఎన్నికలన్నారు. ప్రభుత్వ రంగ పరిరక్షణకు, నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి, పల్లె బడిని బతికించే విధానాల పట్ల పీడీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. ఫెడరేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 2007 శాసనమండలి పునరుద్ధరణ నుంచి ఇప్పటివరకు గెలిచిన పీడీఎఫ్ ఎమ్మెల్సీలు నీతికి, నిజాయితీకి, నిబద్ధతకు కట్టుబడి పనిచేస్తూ ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, కర్షక, ప్రజా సంఘాల, సామాజిక సమస్యల పరిష్కారానికి శాసనమండలిలో ప్రజా గొంతుకగా పోరాటం సలుపుతూ నిలుస్తున్నారని గుర్తు చేశారు. జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ నూతన విద్యా విధానం కార్పొరేటీకరణ, మతతత్వం, ప్రైవేటీకరణను చూపిస్తోందన్నారు. అటువంటి విధానాలను వ్యతిరేకిస్తూ శాస్త్రీయ విద్యకు, రాజ్యాంగ విధానాల అమలుకు కట్టుబడి పనిచేసేటువంటి పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును విద్యావంతులందరూ కలిసి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు హనుమంత రెడ్డి, బొంకూరి వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం నాయకులు శివరామకృష్ణ, యుటిఎఫ్ సభ్యులు ఆర్.అజయ్ కుమార్, డి.వి లింగయ్య, జిలాని, అబ్బరాజు నాగేశ్వరరావు, నాగరాజు, పి. రమేష్ బాబు, పోలయ్య, తిరుపతి రెడ్డి, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - వినుకొండ

పశు సంరక్షణ లక్ష్యంగా సోమవారం నుంచి వినుకొండ నియోజకవర్గవ్యాప్తంగా ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న ఉచిత పశువైద్య శిబిరాలను పాడిరైతులు, పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రోజూ మండలానికి రెండు పంచాయతీల్లో శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉదయం 8 నుంచి పశువులకు వైద్య పరీక్షలు, చికిత్సలు చేసి మందులు అందిస్తారని పేర్కొన్నారు. దీంతో పాటు పశు సంవర్ధక శాఖ పరిధిలో అమలు చేస్తున్న వివిధ పథకాలపై పాడి రైతులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. సోమవారం ఉదయం 8.30 గంటలకు వినుకొండ మండలం నడిగడ్డలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించనున్నట్లు వివరించారు. పాడి పరిశ్రమకు ప్రోత్సాహం ఇవ్వడానికి ఈ కార్యక్రమం ఎంతో దోహద పడుతుందని తెలిపారు. పశు వైద్యం, గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన సదస్సులు ఉంటాయని తెలిపారు.



వైవీని కలిసిన వైసీపీ నేత శ్రీకాంత్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

తాడేపల్లిలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉమ్మడి గుంటూరు జిల్లా రీజినల్ కో-ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డిని పల్నాడు జిల్లా వైసీపీ యువజన విభాగం అధ్యక్షులు కందుల శ్రీకాంత్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏడు నెలల కాలంలోనే ప్రజలు అన్ని విధాలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పేద ప్రజలకు బాసటగా కూటమి ప్రభుత్వం ఉంటుదని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం పట్టణంలోని టిడిపి కార్యలయంలో పలువురికి సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో వివిధ ఆనారోగ్య కారణాలతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకొని, ఆర్థిక సహాయంక కోసం చూస్తున్న 23 మందికి రూ.41,03,052లు అందజేసినట్లు చెప్పారు.

బోట్ రేసింగ్ విజేతలకు అభినందనలు

సంక్రాంతి పండగ సందర్భంగా కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి డ్రాగన్ బోట్ రేసింగ్ పోటీల్లో గురజాల నియోజకవర్గం పొందుగల గ్రామనికి చెందిన పల్నాడు థండర్స్ విజేతగా నిలిచింది. ట్రోఫీని గెలుపొందిన సభ్యులను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అభినందించారు.

నేటి నుంచి గ్రామాల్లో పశువైద్య శిబిరాలు

ప్రజాశక్తి - క్రోసూరు

క్రోసూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్ మల్లయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పశువులకు వైద్యులతో పరీక్షలు నిర్వహించి ఉచిత వైద్యంతో పాటు తేలికపాటి శస్త్రచికిత్సలు నిర్వహిస్తారని తెలిపారు. పశు వులతో పాటు చిన్న దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు ఉచితంగా తాగిస్తారని పేర్కొన్నారు. దీంతో వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా వేస్తారని వివరించారు. రెండు టీంలు ఈ నెల 20న పెరికాపాడు, బయ్యవరం, 21న ఆవులవారిపాలెం, దొడ్లేరు, క్రోసూరు, 22న అందుకూరు, బాలుమర్రు, 23న విప్పర్ల, ఊటుకూరు, 27న అనంతవరం, హస్సనాబాద్, 28న ఎర్రబాలెం, పెరికాపాడు, 29న నాగవరం, పీసపాడు, 30న తాళ్లూరు, ఉయ్యందన, 31న గరికపాడు, గుడిపాడు, గాదెవారిపాలెం గ్రామాల్లో ఆరోగ్య శిబిరాల్లో సేవలు అందిస్తారని పేర్కొన్నారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలి

ముప్పాళ్ల: మండలంలోని గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి జరిగే పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాదల పశు వైద్యులు ఎం.పుల్లారెడ్డి కోరారు. ఈ అవకాశాన్ని పాడిరైతులు, గొర్రెల పెంపకందారులు, కోళ్ల పెంపకందారులు తమ జీవాలకు అవసరమైన వైద్య చికిత్స అందించవచ్చని సూచించారు.

పుట్టిన ఊరు రుణం తీర్చుకుంటా..

ప్రజాశక్తి - దాచేపల్లి

పుట్టిన ఊరు రుణం తీర్చుకుంటానని.. అందులో భాగంగానే ఇక్కడి ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నానని ప్రముఖ వైద్యులు చిట్టెం లక్ష్మణరావు తెలిపారు. గుంటూరు కిమ్స్ శిఖర హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని గురజాల డీఎస్పీ జగదీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంతం మండల ప్రజల కోసం వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ చిట్టెం లక్ష్మణరావును అభినందించారు. ఈ వైద్య శిబిరంలో 1,500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం వైద్యశాలకు సిఫార్సు చేశారు. ఉచితంగా మందులను అందజేశారు.

పేదలకు వైద్యసేవలు అభినందనీయం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కుటుంబమంతా వైద్యవృత్తిలో ఉంటూ, పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడం అభినందనీయమని శాసన మండలి సభ్యులు మర్రి రాజశేఖర్ అన్నారు. పేదల డాక్టర్ కొల్లా రాజ మోహన్‌రావు, ఆయన సతీమణి డాక్టర్ హేమంతిదేవి ఆధ్వర్యంలో ప్రారంభమైన ప్రగతి నర్సింగ్ హోం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని ప్రముఖులు అభినందనలు తెలియజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ మాట్లాడుతూ కొల్లా వెంకయ్య ప్రజలకు సేవ చేస్తే.. వారి కుమారులు డాక్టర్లుగా సేవలందిస్తున్నారని కొనియాడారు. వారసులైన కొల్లా అమర్, అతని భార్య భాగ్యమాల ప్రజలకు ఉన్నతమైన వైద్యాన్ని అందిస్తున్నారని అభినందించారు. కొల్లా కుటుంబ సభ్యులు, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఇతర ప్రముఖులు

పెయింటర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి - వినుకొండ

నియోజకవర్గ పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ప్రముఖ చిత్రకారులు బొడ్డుచర్ల ప్రసాదరావు, ఉపాధ్యాక్షులుగా ఎం. మూర్తి, ఆర్.శంకర్, కార్యదర్శి కె.వందనం బాబు, సంయుక్త కార్యదర్శిగా సి.హెచ్.బాజీ, బీరం శ్రీను, కోశాధికారి ఎస్.కె.సైదా ఎన్నికయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ కమిటీ రెండు సంవత్సరాలు పాటు కొనసాగుతుందని తెలిపారు. పెయింటర్లకు ప్రభుత్వం ద్వారా అందవలసిన సంక్షేమ పథకాలు, ఇంటి స్థలాలు, గుర్తింపు కార్డుల కోసం కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు ఎం.వి. దానయ్య, ఎం.పౌలు రాజు, ఎస్.రాజు కుమార్ సింగ్, జి.చంద్రం, నాగరాజు, పి.రామకృష్ణ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

టీపీఎల్ విజేతగా తెల్లబాడు

ప్రజాశక్తి - వినుకొండ

మండలంలోని తెల్లబాడు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన టి.పి.ఎల్ (తెల్లబాడు ప్రీమియర్ లీగ్) టోర్నీ ముగిసింది. మొత్తం 12 జట్లు పాల్గొనగా.. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తెల్లబాడు జట్టు విజేతగా నిలిచింది.

'త్రిపురనేని చిట్టిబాబుపై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

వృత్తిపరమైన సేవలు అందిస్తూ, సమాజంలో గౌరవంగా బతుకుతున్న చాకలి సామాజిక వర్గీయులపై కొంతమంది పెత్తందారులు, అగ్రకుల నాయకులు కులం పేరుతో దూషించడం బాధాకరమని రజక అభ్యుదయ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు దావులూరు శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని శనివారం రాత్రి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో సీఐ బి.కళ్యాణరాజుకు ఫిర్యాదు చేశారు. ఇటీవల ఒక టీవీ డిబేట్లో ప్రముఖ సినీ విశ్లేషకులు త్రిపురనేని చిట్టి మాట్లాడుతూ.. 'ఆఫ్టాల్ చాకలివాడు' అని సంబోధించడం కుల అహంకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. వెంటనే త్రిపురనేని చిట్టిబాబుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు కార్య నిర్వహణ కార్యదర్శి నూతక్కి నాగేశ్వరరావు, బీసీ సెల్ నాయకులు చావలి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రవికుమార్‌కు సత్కారం

ప్రజాశక్తి-చేబ్రోలు

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ పొన్నూరు కోశాధికారి పోలిశెట్టి విజయ్‌కుమార్‌ను బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు తిరుమలశెట్టి ఉమాశంకర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. క్లబ్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన విజయ్‌కుమార్‌ను అసోసియేషన్ తరపున సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో చిలకపాటి సింహాద్రి, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



హరిత సాయికి మంత్రి ప్రశంసలు

ప్రజాశక్తి-మంగళగిరి

గత ఏడాది నిర్వహించిన తెలుగు టైపు రైటింగ్ లోయర్ గ్రేడ్ ఎగ్జామినేషన్‌లో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన మంగళగిరి మాధవి టైప్ ఇన్స్టిట్యూట్‌కు చెందిన విద్యార్థిని ఆరాధ్యుల హరిత సాయిని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అభినందించారు. కార్యక్రమంలో టైప్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ పి.మురళి పాల్గొన్నారు.

ఘనంగా వాకర్స్ క్లబ్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన వాకర్స్ క్లబ్ 25వ వార్షిక వేడుకలు ఆదివారం స్థానిక కవి రాజా పార్కులోని విజికే భవన్లో నిర్వహించారు. క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, అధ్యక్షులు గుత్తా వెంకటరత్నం అధ్యక్షతన జరిగిన వేడుకల్లో డిస్ట్రిక్ట్ గవర్నర్ పి.శివరాం ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్లబ్ తరపున నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు. అనంతరం సీనియర్ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో సిహెచ్ సీతారామయ్య, సత్యనారాయణ, ఎం.బాపూజీ, ఎస్.ధనలక్ష్మి, టి.ఉషారాణి, షేక్ ఇనాయత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పసుపు రైతుల ధర్నా

విజయవంతం చేయాలని పిలుపు

ప్రజాశక్తి - కొల్లిపర

తెనాలి న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కార్యాలయం వద్ద సోమవారం జరిగే పసుపు రైతుల ధర్నాను కొల్లిపర మండలంలోని రైతులు పాల్గొని జయప్రదం చేయాలని పసుపు రైతు సంఘం నాయకులు మొలక శివ సాంబిరెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని మున్నంగి వల్లభాపురం గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో సుమారు లక్ష బస్తాలు రైతులు నిల్వ ఉంచిన పసుపు కాలిపోయి ఏడాదైందని గుర్తు చేశారు. ఇప్పటి వరకు ఇన్సూరెన్స్ అధికారులు గానీ, ప్రభుత్వం గానీ బాధిత రైతులకు న్యాయం చేయలేదని తెలిపారు. రైతులు పసుపు పంట సాగుకు అప్పులు చేశారని.. మంచి ధర వస్తే అమ్ముకోవచ్చని ఆశతో కోల్డ్ స్టోరేజ్ అద్దెలు కట్టి నిల్వ ఉంచుకుంటే, చివరకు బూడిద మిగిలిందని చెప్పారు. గతంలో స్వయంగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులు, బాధిత రైతులతో సమావేశమై, క్వింటాకు రూ.7 వేలు ఇస్తామని ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు తెనాలి మారీస్‌పేటలో గల న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో అధిక సంఖ్యలో రైతులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో రైతులు కొమ్మారెడ్డి రంగారెడ్డి, బొంతు వెంకటరెడ్డి, అచ్యుత్, సురేష్, వంగా కోటిరెడ్డి, కొండా లక్ష్మారెడ్డి, లంకిరెడ్డి పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకులు సుబ్బారావుకు కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఈ నెల 14న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన తాడేపల్లి పట్టణానికి చెందిన సీపీఎం సభ్యులు మొరతోట సుబ్బారావు (పంపుల సుబ్బారావు) అంత్యక్రియలు ఆదివారం జరిగాయి. తొలుత భౌతిక కాయాన్ని సీపీఎం రాష్ట్ర నాయకులు మున్నూరు భాస్కరయ్య, రాజధాని డివిజన్ కార్యదర్శి మెరుగు మాల రవి, తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, దొంతి రెడ్డి వెంకటరెడ్డి, కొత్తూరు శాఖ కార్యదర్శి మోదుగుల శ్రీనివాసరెడ్డి, దొంతిరెడ్డి విజయభాస్కరరెడ్డి, వై.బర్నబాస్, బొజ్జ సుబ్బారావు, ఈమని రామారావు, చాట్రగడ్డ సుందర రావు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సుబ్బారావు మృతి తీరనిలోటు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రజక వృత్తిదారుల సంఘం తాడేపల్లి నగరపాలక సంస్థ గౌరవ అధ్యక్షులు మొరతోట సుబ్బారావు మృతి తీరనిలోటని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య అన్నారు. సుబ్బారావు భౌతికకాయంపై సంఘం జెండాను కప్పి, పూలమాలను వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాస్కరయ్య మాట్లాడుతూ సుబ్బారావు రజక వృత్తిదారుల సంఘం అభివృద్ధికి కృషి చేశారని, ఆయన స్ఫూర్తితో సంఘం నాయకులు ముందుకు వెళ్లాలని తెలిపారు.కార్యక్రమంలో సంఘం గుంటూరు జిల్లా గౌరవ అధ్యక్షులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు, సభ్యులు పాగోలు శ్రీనివాసరావు, ఉండవల్లి పార్థసారథి, తుమ్మపూడి శివయ్య, తాడేపల్లి సాంబశివరావు, బాబురావు, ఉండవల్లి దుర్గారావు, వెంకటేశ్వర్లు, కొల్లూరు హనుమంతరావు, కాజా శ్రీనివాసరావు, కొత్తపల్లి శ్యామ్, నాగజ్యోషి, నాగరాజు, అద్దంకి బాజీ తదితరులు పాల్గొన్నారు.

'మా ఏపీ'లో గుర్తింపు కార్డుల జారీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్ కార్యాలయంలో ఆదివారం వివిధ రంగాలకు చెందిన సినీ రంగ కార్మికులకు గుర్తింపు కార్డులను జారీ చేసినట్లు సంస్థ వ్యవస్థాపకులు, సినీ దర్శకుడు దిలీప్ రాజా తెలిపారు. అనుభవం ఆధారంగా కార్డులను మంజూరు చేశామన్నారు. తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్రలకు చెందిన వివిధ శాఖల సినీ కార్మికుల అభ్యర్ధన మేరకు 'మా-ఏపీ' గుర్తుంపు కార్డులను జారీ చేసినట్లుగా ఆయన చెప్పారు. తెనాలికి చెందిన ఓ బోటిక్ సెంటర్ యజమాని పట్నాల పార్వతిని కాస్ట్యూమ్ డిజైనర్‌గా సినీ రంగానికి పరిచయం చేసినట్లు దిలీప్ రాజా తెలిపారు.

ఆనాటి జ్ఞాపకాలు పదిలం..

ప్రజాశక్తి-దుగ్గిరాల

చిన్ననాటి జ్ఞాపకాలు, తీపి గురుతులు, అల్లర్లు నెమరవేసుకుంటూ ఆనందంగా గడిపారు ఆ పూర్వ విద్యార్థులు.. స్థానిక నిమ్మగడ్డ ఫౌండేషన్ బాలుర ఉన్నత పాఠశాలలో 1995- 96 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు.. ఆదివారం మండల కేంద్రం దుగ్గిరాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఒకరికొకరు కుశల ప్రశ్నలు వేసుకున్నారు. సంతోషంగా ఆనాటి జ్ఞాపకాలు పంచుకున్నారు. కార్యక్రమంలో కృష్ణ కుమార్, శ్రీధర్, వెంకటరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి బ్రహ్మానందపురం కెసి వర్క్స్ హైస్కూల్‌లో 1992-93 బ్యాచ్ పదోతరగతి పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి రోజులను గుర్తు చేసుకుంటూ అంతా సందడిగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కురగంటి వెంకటేశ్వరావు, ఆమడాల ప్రణీత్, దర్శి రమేష్, కాజా రాంబాబు, పెడమర్ల శ్రీనివాసరావు, జగన్మోహిని, లక్ష్మీ ప్రసన్న, వరలక్ష్మి, శ్రీ దుర్గా, రమాదేవి, ఉమా దేవి, సువార్త, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు. నాటి ఉపాధ్యాయులను సత్కరించారు.

కడప, కృష్ణా.. విజయ దుందుభి

ప్రజాశక్తి-మంగళగిరి

మంత్రి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్ పోటీలు కొనసాగాయి. ఆదివారం కడప, తూర్పుగోదావరి మధ్య జరిగిన మ్యాచ్‌లో కడప జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన తూర్పుగోదావరి జట్టు 14.4 ఓవర్లలో 75 పరుగులు చేసి కుప్పకూలింది. కడప జట్టు 31 పరుగుల తేడాతో విజయం సాధించింది. నాలుగు ఓవర్లలో 18 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీసిన షేక్ ఆరిఫ్ బాషా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గెలుచుకున్నాడు. అనంతరం కృష్ణా, చిత్తూరు మధ్య జరిగిన మ్యాచ్‌లో కృష్ణా జట్టు నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 9 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు 16.5 ఓవర్లలోనే 155 పరుగులు చేసి విజయం సాధించింది. 21 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీసిన ఎం.శ్రీను మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సొంతం చేసుకున్నాడు.

కొనసాగిన రిలే దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఏసీసీ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని పోరాట కమిటీ కన్వీనర్ కూరపాటి స్టీవెన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని ఏసీసీ కార్మికుల రిలే నిరాహార దీక్షలు ఆదివారంతో 47వ రోజుకు చేరాయి. ఈ దీక్షలను ఏఐఎఫ్టీయూ నాయకులు కె.ఆదినారాయణ, కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు తమకు రావలసిన నష్టపరిహారం కోసం న్యాయ పోరాటం చేస్తున్నా.. పాలకులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. లేబర్ కోర్టు తీర్పు ఆదేశాలను సైతం యాజమాన్యం బేఖాతరు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, యాజమాన్యం నిర్లక్ష్యాన్ని విడనాడి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో బి.నవనీతం, శారద, డి.రమణ, ఎస్.శారమ్మ, ఎస్.ధనమ్మ కూర్చొన్నారు.

నేత్ర వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి - తాడికొండ

స్థానిక శ్రీ సత్యసాయి హైస్కూల్‌లో బండ్ల కోటేశ్వరరావు మిత్రమండలి సారథ్యంలో శంకర కంటి ఆసుపత్రి సహకారంతో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 91 మందికి కంటి పరీక్షలు చేశారు. 44 మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. వీరికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించనున్నట్లు రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి బండ్ల కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మేఘన, తనీమా, బండ్ల పట్టాభిరామయ్య, దనేకుల హరిబాబు, కొలకపూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవకారుడు యోగి వేమన

ప్రజాశక్తి - పెదనందిపాడు

ఆనాటి సమాజంలోని మూఢనమ్మకాలను ఎత్తిచూపి, తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్యపరచిన అభ్యుదయవాది, ప్రజా కవి, సంఘసంస్కర్త, సామాజిక విప్లవకారుడు యోగివేమన అని ఎస్‌టీయూ రాష్ట్ర కౌన్సెలర్ గేరా మోహనరావు అన్నారు. ప్రజాకవి యోగి వేమన జయంతిని ఆదివారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహకురాలు పి.సుభాషిని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొలగాని మంజుల, శివయ్య, వీరయ్య పాల్గొన్నారు.

ఇద్దరు వీఆర్వోలపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విధుల్లో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణల కారణంగా యడ్లపాడు -1 వి.ఆర్.ఓ మహబూబ్ సుభానీతోపాటు.. బొల్లాపల్లి మండలం సరికొండపాలెం గ్రామంలో అసైన్డ్ భూములను వి.ఆర్.ఓ రవి నాయక్ తన కుటుంబ సభ్యుల పేరుతో ఆన్లైన్లో నమోదు చేసినట్లు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో అతనిని సస్పెండ్ చేస్తూ జిల్లా రెవెన్యూ అధికారి మురళి ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

నేటి నుండి గ్రామాల్లో పశువైద్యశిబిరాలు

ఉచిత పరీక్షలు - తేలికపాటి శస్త్రచికిత్సలు

ప్రజాశక్తి-గుంటూరు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

గుంటూరు జిల్లాలోని 18 మండలాల్లోని అన్ని గ్రామాల్లో జనవరి 20వ తేదీ నుండి 31 వరకూ పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఓ.నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతులమీదుగా ఆదివారం కలెక్టరేట్‌లో శిబిరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ శిబిరాల్లో ఉచిత పశు ఆరోగ్య పరీక్షలు, తేలికపాటి శస్త్ర చికిత్సలు, ఎదకు రాని, చూలు కట్టని, ఇతర గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, వైద్యం అందించటం జరుగుతుందన్నారు. పశువులకు, దూడలకు, సన్నజీవాలకు నట్టల నివారణ మందు, పశువులకు, కోళ్లకు వ్యాధినిరోధక టీకాలు, అవగాహన శిబిరాలలో పశు పోషకులకు శాస్త్రీయ పశుయాజమాన్యపద్ధతులపై నిష్ణాతులైన పశువైద్యులతో నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ శిబిరం కోసం ప్రతి మండలంలో రెండు బృందాలు ఏర్పాటు చేసి, ప్రతి బృందానికి ఒక పశు వైద్యుడిని, ఒక సహాయకుడిని, గోపాలమిత్ర, సహాయ సిబ్బందిని ఇచ్చామన్నారు. కావున పశుయజమానులు ఈ శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న సీతామహాలక్ష్మి

అవయవదానంతో మరొకరికి పునర్జన్మ

ప్రజాశక్తి-గుంటూరు : అవయవ దానం పట్ల సనాతన భారతీయ సాంప్రదాయాలలో అపోహలు తొలగించుకోవడం ద్వారా అభ్యుదయ, అభివద్ధికర సమాజాన్ని నిర్మించవచ్చని అఖిలభారత అవయవ దాతల సంఘం వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి అన్నారు. స్థానిక అరండల్‌పేట ఆర్య సమాజం సమావేశ మందిరంలో వల్లూరి రాజారత్నం కోటేశ్వరరావు సంస్మరణ సందర్భంగా బంధుమిత్రులు రక్తసంబంధీకులు వివిధ స్వచ్ఛంద సంస్థలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. విద్యావేత్త గడ్డిపాటి పద్మరాణి సభకు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సీతామహాలక్ష్మి మాట్లాడుతూ మనిషి పార్థివదేహాన్ని ఖననం చేసే కంటే దాని ద్వారా అవసరమైన వారికి అవయవాలు అందించడం ద్వారా మనిషి చనిపోయినా బ్రతుకుతున్నాడని చెప్పారు. శరీర అవయవ దానంపై ప్రజాచైతన్యం తెచ్చేందుకు ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు ఉద్యమంగా పనిచేయవలసిన అవసరం ఉన్నదన్నారు. కార్యక్రమంలో ఆర్య సమాజం అధ్యక్షురాలు గుర్రం నిర్మలదేవి ప్రసంగించారు. ఆర్య సమాజం ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం, రాజ్యాంగ పీఠిక పుస్తకాలను పంపిణీ చేశారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు విశిష్ట సేవ పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో నూతలపాటి తిరుపతయ్య, ఓరుగంటి నారాయణరెడ్డి, కల్లూరి మురళీధరరావు, పావులూరి రమేష్, ఎండి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ కార్యక్రమాలకు నిలయాలు విజ్ఞాన కేంద్రాలు : ఎమ్మెల్సీ కెఎస్

ప్రజాశక్తి - పెదనందిపాడు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు

నియోజకవర్గంలో దీర్ఘకాలంగా నల్లమడ ఆధునీకరణ, గుంటూరు ఛానల్ పొడిగింపు సమస్యలు కొనసాగుతున్నాయని పరిష్కారాని కి ప్రభుత్వం కృషి చేయాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఆదివారం పెదనంది పాడులోని తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు శిక్షణ 3 వ బ్యాచ్ ముగింపు సభను విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. సభలో లక్ష్మణరావు మాట్లాడుతు తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం మహిళలకు, విద్యార్థులకు ఉపయోగపడుతుందని, ఈ విజ్ఞాన కేంద్రం ద్వారా కంప్యూటర్ శిక్షణ, ట్యూషన్ సెంటర్ ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. బహు ముఖ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు ఉపయోగపడుతున్న విజ్ఞాన కేంద్రం నిర్వాహ కులను అభినందించారు. పారిశ్రామిక వేత్త దాసరి శేషగిరిరావు మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రం నిర్వహించే కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు మాట్లాడుతూ భవిష్యత్తులో అందరి అవసరాల కోసం విజ్ఞాన కేంద్రం పైన ఒక హాలు నిర్మించేందుకు అందరి సహకారం తీసుకుంటామని అన్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఈ ప్రాంతం లోని రైతులు, ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న గుంటూరు ఛానల్ సమస్య పరిష్కారం కోసం అధికారులను, మంత్రులను, గత 5 సంవత్సలుగా కలుస్తు న్నారని, సమస్య పరిష్కారం కొరకు ప్రయత్నిసు న్నారని అన్నారు. ఎక్కడ సమస్య ఉంటే అక్కడ లక్ష్మణరావు ఉంటారని అన్నారు. అలాంటి వ్యక్తిని రాబోయే శాసన మండలి ఎన్నికలలో గెలిపించు కోవలసిన అవసరం, బాధ్యత మనపై ఉందని అన్నారు. అత్యధిక మెజారిటీ తో లక్ష్మణరావును గెలిపించాలని అన్నారు. అరవపల్లి కృష్ణమూర్తి మాట్లాడుతూ కుట్టు శిక్షణ పొందిన మహిళలకు బ్యాంకు ద్వారా రుణం కావాలంటే తాను అందుకు సహకారం అందిస్తానని అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయు రాలు మక్కెన జవహర్ రాణి, సూరే రామ సుబ్బారావు, పఠాన్ సుభాని, గేరా మోహన రావు, నల్లపనేని శివప్రసాద్ మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రం నిర్వహించే అన్ని కార్యక్రమాలకు తమ సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. లక్ష్మణరావు గెలుపు కోసం తాము పని చేస్తామని అన్నారు. కార్యక్రమం లో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావు, పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు జంపని రామారావు, కొమ్మూరు మాజీ సర్పంచ్ హరిబాబు, నూతి పూర్ణచంద్రరావు, కాపు వెంకట సుబ్బారావు, కొమ్మినేని శ్రీనివాస రావు,మర్రి లక్ష్మి,కన్నెగంటి చంద్రరావు, నల్లమోతు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లౌకిక శక్తులను ఏకం చేయడానికి ఆవాజ్ కృషి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ చిష్టి - 12 మందితో ఆవాజ్ నూతన జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు

అవాజ్ జిల్లా నూతన కమిటీ ఎన్నికైంది. జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా మహమూద్ సుభాని, ఎస్.కె.భాషాతో సహా 12 మందితో కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం పాతగుంటూరు సిఐటియు కార్యాలయ సమా వేశ మందిరంలో అవాజ్ జిల్లా అధ్యక్షులు షేక్.భాష అధ్యక్షతన జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవాజ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎంఎ.చిష్టీ మాట్లాడుతూ దేశంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి పూర్తి మెజారిటీ లేకపోయినా తన మతోన్మాద అజెండాను అమలు చేయటానికి ప్రయత్నిస్తుందన్నారు. బిజెపి ప్రభుత్వ విధానాలను ఎదుర్కొనడానికి దేశవ్యాప్తంగా లౌకిక శక్తులను కలుపుకొని మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయడమే మార్గమ న్నారు. లౌకిక శక్తులను ఏకం చేయటా నికి ఆవాజ్ కృషి చేస్తుందని చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా మైనారిటీలకు ఇచ్చిన ప్రత్యేకమైన హామీలను అమలు చేయాలని కోరారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు నళినీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపి చాపకింద నీరులా జనసేనను అడ్డుపెట్టుకొని తన మతోన్మాద జెండాను అమలు చేయాలని చూస్తుందని, వీరి విధానాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అంబేద్కర్‌ను అవమాన పరుస్తూ అమిత్‌షా పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగం పట్ల వారికి ఉన్న చిత్తశుద్ధి అర్థం అవుతుందని ఎద్దేవా చేశారు. రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అదే విధంగా చట్టసభల్లో సామాన్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లటానికి నిస్వార్థం, నిబ ద్ధతతో కృషి చేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

ఎన్నికైన నూతన కమిటీ

వాటర్ గ్రిడ్ ద్వారా పల్నాడు జిల్లాలో ఇంటింటికీ శుద్ధజలం

కుళాయిల ద్వారా సరఫరా - 30 ఏళ్ల ముందు చూపుతో వాటర్ గ్రిడ్ సామర్థ్యం

రూ .1200 కోట్ల కేటాయింపు - రానున్న రెండేళ్లలో మొదటి దశ పనులు పూర్తి

ప్రజాశక్తితో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇ వి.విజయ్ కుమార్

వాటర్ గ్రిడ్ ద్వారా రానున్న 30 ఏళ్లలో పెరగనున్న జనాభా ప్రాతిపదికన పల్నాడు జిల్లాలో కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు చెరి సగం నిధులతో ఏర్పాటు చేయనున్న వాటర్ గ్రిడ్ ద్వారా పల్నాడు జిల్లా వాసులకు శుద్ధజలం కుళాయి ల ద్వారా సరఫరా చేసేందుకు మొదటి దశ పనులు త్వరలో ప్రారంభం కాను న్నాయి. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వాటర్ గ్రిడ్‌కు సంబంధించిన పలు అంశాలను ఎస్.ఇ వి.విజయ్ కుమార్ వెల్లడిం చారు.

వాటర్ గ్రిడ్ ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారు? లక్ష్యం ఏంటి?

పల్నాడుకు ప్రధాన నీటి వనరు అయిన నాగార్జున సాగర్ జలాశయానికి దగ్గరగా విజయపురిసౌత్ వద్ద వాటర్ గ్రిడ్ ఏర్పాటుకు స్థల సేకరణ జరిగింది. రానున్న 30 ఏళ్ళ నాటికి పెరగనున్న జనాభా ప్రాతిపదికన తగిన సామర్థ్యంతో వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసి శుద్ధి చేసిన కృష్ణా జలాలను పల్నాడు ప్రజలకు అందించడమే లక్ష్యం.

విపి సౌత్ నుండి శుద్ధ జలం జిల్లా మొత్తం నీటి సాధ్యమేనా?

విపి సౌత్ వద్ద ఏర్పాటు చేయనున్న వాటర్ గ్రిడ్ నుండి పైపు లైన్ ద్వారా ఇప్పటికే గ్రామాల్లోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల వద్దకు అక్కడ నుండి గ్రామాలలో ఇంటింటికి ఏర్పాటు చేసిన కుళాయి ద్వారా శుద్ధ జలం పంపిణీ చేస్తాం. అత్యంత అనుభవం కలిగిన ఇంజనీర్ల పర్యవేక్షణలో ఈ ప్రక్రియ సాగనుంది.

మొదటి విడతకు ఎంత నిధులు కేటాయించారు?

దీనికి సంబంధించి రూ.1200 కోట్లు నిధులు కేటాయించారు. దీనిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం నిధులు కేటాయింపు జరిగింది. దీనికి సంబంధించి ఆన్‌లైన్ టెండర్ల ను ఆహ్వానించాం. 24తో టెండర్ ప్రక్రియ గడువు ముగియనుంది.

మొదటి విడత పనులు ఎప్పటికి పూర్తవుతాయి?

టెండర్ ప్రక్రియ ముగియగానే పనులు మొదలవుతాయి. రానున్న 2 ఏళ్లలో మొదటి విడత పనులు పూర్తి చేసి, అవి చివరి దశకు చేరుతుండగా 2వ విడత టెండర్లను ఆహ్వాని స్తాము. ప్రభుత్వ లక్ష్యం మేరకు రానున్న 5 ఏళ్లలో ఇంటింటికి శుద్ధ జలం కుళాయి ద్వారా వ్యక్తికి రోజుకు 55 లీటర్ల సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి.

మొదటి విడతలో ఎన్ని గ్రామాలకు నీరు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి?

మొదటి విడత పల్నాడు జిల్లా లోని మాచర్ల, గురజాల నియోజకవర్గాల లోని 10 మండలాలతో పాటు పెదకూరపాడు నియోజక వర్గం లోని బెల్లంకొండ మండలాన్ని కలిపి మొత్తం 11 మండలాలను ఎంపిక చేశాము. 11 మండలాల్లోని 235 గ్రామాలకు (శివారు గ్రామాలతో కలిపి) వాటర్ గ్రిడ్ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. 2 వ విడతలో మిగిలిన 17 మండలాల లోని 543 గ్రామాలను కలిపి మొత్తం 778 గ్రామా లకు నీటి సరఫరా జరుగుతుంది.

వాటర్ గ్రిడ్ ప్రతిపాదనకు ముందు జల్ జీవన్ పథకం కింద మంజూరైన రూ.508 కోట్ల పనుల పురోగతి ఏంటి?

జిఓ నెం.918 2022 మేరకు రూ 508

కోట్లు మంజూరు అయ్యాయి. జల్ జీవన్ మిషన్ పథకం జరిగిన పనులకు రూ 68 కోట్లు చెల్లింపులు జరిగాయి. వివిధ దశలలో ఉన్న పనులకు సంబంధించి రూ 152 కోట్లు చెల్లించాల్సి ఉంది. 508 కోట్లకు సంబంధించిన నిధులలో 480 కోట్లు నిధులు రద్దయ్యాయి.

జిల్లాలో భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ ఉందని కేంద్రం నివేదిక ఇచ్చింది? దీనికి ప్రత్యామ్నాయం ఏంటి?

జిల్లాలో ప్రధాన నీటి వనరు నాగార్జున సాగర్ జలాశయం మినహా ఎటువంటి నీటి వనరులు లేవు. దీనికి ప్రత్యామ్నాయమే వాటర్ గ్రిడ్. గ్రిడ్ పనులు త్వరితగతిన పూర్తి చేసి శుద్ధి చేసిన కృష్ణా జలాలు అందజేసే వరకు తమ పరిధిలోని శుద్ధ జలం తాగడమే ప్రత్యామ్నాయం.

నీటి కుళాయిలకు మీటర్లు బిగిస్తారని ప్రజలలో అపోహలు ఉన్నాయి?

దీనికి సంబంధించి ఎటువంటి ముం దస్తు సమాచారం లేదు. నీటి వృధా అరికట్టేందుకు బహుశా భవిష్యత్తులో ఆ పరిస్థితి ఉంటుందేమో.

రాబోవు వేసవిలో తాగు నీటి సమస్యలు రాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

రానున్న వేసవి దృష్ట్యా తీవ్ర నీటి ఎద్దడి ఉండే వినుకొండ, మాచర్ల, గురజాల నియోజకవర్గాల లోని గ్రామీణ ప్రాంతాలకు ట్యాంకర్ ల ద్వారా నీటిని సరఫరా చేసే ప్రణాళికలు ఉన్నాయి. దీనికి సంబంధించి రూ 3.35 కోట్లు నిధులు అవసరం ఉంటాయని ఉన్నతాధికారులకు నివేదించడం జరిగింది.

(ప్రజాశక్తి-పల్నాడు జిల్లా)